క్లుప్తంగా

ప్రగతికి సంపూర్ణ అక్షరాస్యత కీలకం



కాకుమాను: సంపూర్ణ అక్షరాస్యత ద్వారానే అభివృద్ధి సాధ్యమని, దీనికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో ఆదివారం సంపూర్ణ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్షరాస్యత సాధనలో ముందున్న అనేక దేశాలు ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా సంపూర్ణ అక్షరాస్యత సాధించలేకపోవడంతో ప్రగతికి చాలా దూరంలో ఉన్నామని అన్నారు. ప్రభుత్వంతోపాటు మేధావులు, ప్రజలందరు ఈ సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిణి, గారపాటి రమేష్, జి.రామస్వామి, డి.దాసు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



పెదకాకాని: వరద బాధితులకు కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేస్తున్నట్లు టెంపుల్ వ్యవస్థాపకుడు పి.సతీష్‌కుమార్ సోదరుడు పాస్టర్ సురేష్ తెలిపారు. పెదకాకాని కల్వరి టెంపుల్ ప్రాంగణం నుంచి ఆదివారం పలు వాహనాల్లో 400 నిత్యావసర సరుకుల కిట్లతో వాహనాలు బయలుదేరి విజయవాడ వరద ప్రాంతాలకు చేరుకున్నాయన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ సురేష్ మాట్లాడుతూ గతవారం రోజులుగా కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆహార ప్యాకెట్‌లు, బిస్కెట్‌లు 10 వేల మందికి పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఒక్కో కుటుంబానికి 10 రోజులు సరిపడా ఉండేలా నిత్యావసర సరుకుల కిట్‌లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గతంలో కర్నూలు వరదల సమయంలోనూ కల్వరిటెంపుల్ ఆధ్వర్యంలో బాధితులకు సహాయ సహకారాలు అందించడం జరిగిందని గుర్తు చేశారు. కోవిడ్ సమయంలోనూ కల్వరి టెంపుల్‌ను కోవిడ్ కేంద్రాలుగా మార్చి వైద్యసేవలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విల్సన్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

'సిబార్' ఆర్థిక సాయం



పెదకాకాని: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు రూ.10 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసినట్లు సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ తెలిపారు. వరద బాధితులకు సహాయ సహకారాలు అందించేందుకు మేము సైతం అంటూ పెదకాకాని మండంలోని తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాల యాజమాన్యం ముందుకు వచ్చింది. డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలోనే సంతృప్తి ఉంటుందన్నారు. కళాశాల ఆధ్వర్యంలో వరద బాధితులకు ఒకరోజు ఆహారం పులిహోర, పెరుగన్నం, సాంబారు అన్నం ప్యాకెట్లు అందజేయడంతో పాటు మందులు, వాటర్ బాటిళ్లు, దుస్తులు, బిస్కెట్‌లు, నిత్యావసరాలు పంపిణీచేయడం జరిగిందన్నారు. వరద బాధితులకు నిత్యం పెద్ద ఎత్తున ఆహార పదార్థాలు ఏర్పాటు చేస్తున్న హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ వారికి రూ.50వేలు అందజేశామన్నారు. సిబార్ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటరమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి, జానపద నృత్యాలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం కూచిపూడి, జానపద, కోలాట నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీశారదానికేతన్ ఉన్నత పాఠశాల, కళాశాలకు చెందిన ముప్పై మంది విద్యార్థినులు ఏకదంతాయ వక్రతుండాయతో నృత్యాలు ప్రారంభించారు. అనంతరం కూచిపూడి నృత్యాలు, మయసభలోని దుర్యోధన, ఝాన్సీలక్ష్మీబాయి, ఛత్రపతిశివాజీ, రుద్రమదేవి ఏకపాత్రాభినయాలు, శ్రీనివాస కల్యాణం, మామా కూతురా జానపద నత్యాలు, శివపార్వతుల నృత్యం, తెలుగు రూప కాలు చక్కగా ప్రదర్శించారు. కార్యక్రమంలో శారదానికేతన్ కార్య నిర్వహణ అధికారి జి.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కోటిరత్నం, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉషాకుమారి పాల్గొన్నారు.

వాడవాడలా
వినాయక చవితి



పొన్నూరులో ప్రత్యేక పూజల్లో భక్తులు



ప్రత్తిపాడు రెడ్డి యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన భారీ గణపతి

ప్రత్తిపాడు: వినాయక చవితి సంబరాలు అంబరాన్నంటాయి. గణనాథుడి నామస్మరణతో గ్రామాలు మారుమోగాయి. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మంటపాలు భక్తులతో నిండిపోయాయి. ఆదివారం పలుచోట్ల నిమజ్జనం చేశారు. పండుగ సందర్భంగా వాడవాడలా కొలువుదీరిన గణనాథులకు విగ్రహ కమిటీలు ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. విభిన్న ఆకృతుల్లో గణపయ్య భక్తులను కనువిందు చేశారు. శాలివాహన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లంబోదరుడిని వైభవంగా నిమజ్జనానికి తరలించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలోని విఘ్నాధిపతిని కూడా ఘనంగా నిమజ్జనం చేశారు. తొలుత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలంపాటలో యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మట్టా వెంకటేశ్వర్లు రూ.20 వేలకు లడ్డూ దక్కించుకున్నారు.

చేబ్రోలులో..

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో వినాయకచవితి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వినాయకచవితి సందర్భంగా చలువ పందిళ్లు వేసి భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని కూడలి ప్రాంతాల్లో భక్త బృందాలు ఆకర్షణీయమైన భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. మెయిన్ రోడ్డు ప్రాంతంలో ఆర్య వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఆకట్టుకుంది. ఆయా చోట్ల భారీ వినాయక విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేశారు.

పొన్నూరు పరిధిలో...

పొన్నూరు: గణపతి నవరాత్రి మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వినాయక చవితి సందర్భంగా పొన్నూరులో వాడవాడలా మండపాల్లో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రత్యేక పందిళ్లలో విద్యుత్ దీపాలంకరణతో వివిధ ఆకృతుల్లో కొలువుదీరిన గణనాథుల విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. వివిధ రకాల పత్రులు, పండ్లతో పూజించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పట్టణ ప్రజలు తమ గృహాల్లో పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం నుంచి పట్టణంలోని తెలగపాలెం, షరాఫ్ బజార్, నిడుబ్రోలు, జీబీసీ రోడ్డు, ఎస్బీబీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలోని వినాయక స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆదివారం రెండో రోజు స్వామివారు విశేష పూజలు అందుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో మూడో రోజున, మరికొన్ని ప్రాంతాల్లో ఐదో రోజున స్వామివారి పూజలు ముగించి నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నారు.




వేలంపాటలో రూ.20 వేలకు లడ్డూ దక్కించుకున్న యువకుడు



నడింపాలెం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏకదంతునికి ప్రత్యేక పూజలు



చేబ్రోలు ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహం



చేబ్రోలు రజకపేటలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం



నడింపాలెంలో లంబోదరునికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నిమజ్జనానికి తరలిన
గణనాథులు



పెదకాకానిలో తరలుతున్న స్వామివారు

పెదకాకాని: వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని భక్తులు ఘనంగా వేడుకలు జరుపుకొన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద పెద్ద విఘ్నేశ్వరుని బొమ్మలను పందిళ్లకు తరలించి అలంకరించారు. శనివారం ఉదయం స్వామివారి పూజకు అత్యంత ప్రధానమైన పత్రిని సేకరించి పూజలకు ఏర్పాట్లు చేసుకున్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని వినాయక పందిళ్లలో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పలు మండపాల్లో దంపతులు జంటలుగా కూర్చుని వేడుకగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తులు సాయంత్రానికే స్వామివారిని ప్రత్యేక ట్రాక్టర్‌పై శోభాయమానంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. కనక తప్పెట్లు, తీన్‌మార్ సందడి, డీజే సౌండ్స్‌తో బయలు దేరి గ్రామంలో కోలాటం, కర్రసాము, నృత్యాలతో సందడి చేశారు. ప్రజలు గ్రామోత్సవానికి స్వాగతం పలికి పూజా సామగ్రి సమర్పించి భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. రెండవరోజు సోమవారం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. రహదారి పొడవునా భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. గుంటూరు ఛానల్, తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, నంబూరు, తదితర ప్రాంతాల్లో గణనాథుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.



గుంటూరు చానల్‌లో నిమజ్జనం చేస్తున్న భక్తులు

మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయం ఆవరణలో శనివారం మట్టి గణపతిని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినానికి, ప్రకృతికి అవినాభావ సంబంధం ఉందని, దాన్ని మన పూర్వీకులు సంవత్సరాల క్రితమే సంప్రదాయంగా అందించారని తెలిపారు. గణేశుని పూజా విధానంలో అనేక ఆయుర్వేద నియమాలు, ఆరోగ్య సూత్రాలు, పలు రకాల వ్యాధులకు ముందు జాగ్రత్తలు నిక్షిప్తమై ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలంతా మట్టి గణపతి ప్రతిమను పూజించడం ద్వారా పండుగ మరింత శోభామానంగా విరాజిల్లుతుందని చెప్పారు. దీంతో ప్రకృతి పూజా ద్రవ్యాలు, సంబరాలతో సంపూర్ణ పర్యావరణ రహితంగా మారుతుందని వివరించారు. కార్యక్రమంలో బజరంగ్ అర్బన్ డైరెక్టర్లు సిద్దినేని శ్రీనివాసరావు, సమీర్‌నందన్, జి.సుబ్బారావు, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



వినాయక విగ్రహానికి నమస్కరిస్తున్న అంబటి మురళీకృష్ణ

కాలువ గండ్లకు మరమ్మతులు

అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులే స్వయంగా పనులు చేస్తున్న వైనం

పెదకాకాని: తుఫాన్ ప్రభావంతో కళ్లముందే పైరు కుళ్లిపోతుంటే కాపాడుకునేందుకు రైతులు నడుంబిగించారు. వరద కారణంగా గండి పడి పొలాల్లోకి నీరు చేరుతుండటంతో స్వయంగా పనులు ప్రారంభించుకున్నారు. పెదకాకాని మండల పరిధిలోని నంబూరు గ్రామ శివార్లలోని పెనుమూలి రోడ్డులో గత వారం రోజులుగా మురుగుకాలువకు గండి పడి పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. నీరు బయటకు వెళ్లకపోగా చెరువులా మారిన పంట పొలాల్లో పైరు సైతం కుళ్ళిపోతుంది. రైతులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నా నీటి పారుదలశాఖ అధికారులు మాత్రం పొలాల వైపు కూడా తిరిగి చూడటం లేదు. దీంతో గత్యంతరం లేక రైతులు స్వయంగా రంగంలోకి దిగి గండి పడిన చోట ఇసుక, కంకర మూటలు కట్టి పొలాల్లో మోసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అన్నదాతలకు అండగా నిలవాలని పలువురు కోరుతున్నారు.



నంబూరులో పంటలను కాపాడుకునేందుకు కాలువ గండ్లు పూడ్చుకుంటున్న రైతులు

నిండా మునిగాం.. ప్రభుత్వమే ఆదుకోవాలి

కేంద్ర మంత్రికి అన్నదాతల వినతి

చేబ్రోలు: కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు పంటలన్నీ నీటమునిగాయని, ఇంతవరకు పొలాల్లోని నీళ్లు బయటకు వెళ్లలేదని పలువురు రైతులు కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకొచ్చారు. నీట మునిగిన పంట పొలాలను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు ఆదివారం పరిశీలించారు. చేబ్రోలు మండలం శేకూరు, వీరనాయకునిపాలెం గ్రామాల్లో నీటమునిగిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రెండు గ్రామాల పరిధిలో అల్పపీడన ప్రభావం తగ్గిపోయినప్పటికీ పంట పొలాల్లోని వరద నీరు ఇంకా బయటకు పోలేదు. ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహం తగ్గకపోవటంతో పొలాలు నీట మునిగిపోయినట్లు రైతులు తెలిపారు. పంట పొలాలు జల సంద్రంగా మారాయని పంట మీద ఆశ వదులుకున్నామని ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరారు. సాగునీటి, మురుగునీటి కాలువలను అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు.

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

ప్రత్తిపాడు: రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరు, కోవెలమూడి, కారంపూడిపాడు గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులతో కలిసి ఆయన పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. అనంతరం పెమ్మసాని మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో ప్రధానంగా గుంటూరు చానల్‌ను పొడిగించడం, ఆధునికీకరణ అవసరమన్నారు. ఇందుకు సుమారు రూ.ఆరు వందల కోట్లు అవసరమవుతాయని తెలిపారు. ఇప్పటికే విషయాన్ని సీఎం దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లారని, త్వరలోనే ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఒక్కో రైతు సుమారుగా రూ. 50 వేల వరకు నష్టం జరిగినట్లు తెలుస్తోందన్నారు. రైతాంగాన్ని సీఎం చంద్రబాబు ఆదుకుంటారని చెప్పారు. ఊహించని విపత్తులో రైతులంతా అల్లాడిపోతున్నారన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. ప్రతి కౌలు రైతుకూ బీమా మొత్తం వచ్చేలా చూస్తామని చెప్పారు. ఎమ్మెల్యే బూర్ల మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించామని తెలిపారు. రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. వారి వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

పొన్నూరు: మండలంలోని జూపూడి, మన్నవ, దొప్పలపూడి గ్రామాలలో భారీవర్షాల కారణంగా నీట మునిగిన పొలాలను శనివారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పరిశీలించారు. పంట పొలాలకు ప్రధానమైన మురుగు కాలువలకు మరమ్మతులు చేయని కారణంగా, అవి పారుదల లేక స్తంభించి పోవడంతో రైతులు పంటనీరు పెట్టుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభావం తగ్గిపోయి కొద్దిరోజులు గడుస్తున్నప్పటికీ , మునిగిపోయిన పంట పొలాల్లో నీటి ప్రవాహం ఇంకా తగ్గలేదని పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయని, తాము సాగు చేస్తున్న పంట బతుకుతుందనే ఆశను కోల్పోతున్నామని రైతులు వాపోయారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించే విధంగా చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బోర్ర రామారావు, రైతులు, పాల్గొన్నారు.



ముట్లూరులో పంట నష్టాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

పట్నంబజారు: యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు అయింది. పట్టాభిపురం పోలీసుల కథనం మేరకు.. శ్యామలనగర్‌లో నివాసం ఉండే యువతికి బీటెక్ చదువుతున్నప్పుడు నగరంపాలేనికి చెందిన నిమ్మకాయల శ్రీనివాస్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ప్రస్తుతం ఆమె హైదరాబాదులో ఉద్యోగం చేస్తోంది. శ్రీనివాస్ కుమార్ నిత్యం ఆమెని వేధిస్తున్నాడు. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వరద సహాయక సర్వేలో విద్యార్థులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, విజ్ఞాన్ లారాకి చెందిన 300 మందికి పైగా విద్యార్థులు విజయవాడ నగరంలోని 18 వార్డుల్లో అందుతున్న సహాయక చర్యల సర్వేలో పాల్గొన్నట్లు వైస్ చాన్సలర్ పి.నాగభూషణం ఆదివారం తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు విజయవాడ నగరంలోని కొన్ని ప్రాంతాలు వరద ముంపునకు గురైన విషయం తెలిసిందేనని, ప్రజలకు ప్రభుత్వం అందించిన సహాయక కార్యక్రమాలు, వివిధ రకాల సేవా కార్యక్రమాలు సరిగా అందాయా లేదా అనే సర్వేలో తమ వర్సిటీకి చెందిన విద్యార్థులు పాల్గొన్నారని వెల్లడించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యార్థులు పర్యటించి వారికి అందుతున్న ఆహారం, రేషన్ తదితర సహాయక చర్యలు, శానిటేషన్, విద్యుత్ సరఫరా, మంచినీటి సరఫరా జరుగుతున్న తీరును పరిశీలించారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వ అధికారుల పనితీరుపై మీరు సంతృప్తిగా ఉన్నారా లేదా అనే అంశాలపై డేటా సేకరించి ప్రభుత్వం అందించిన గూగుల్ లింక్‌లో అప్లోడ్ చేస్తున్నట్లు తెలిపారు.



వేజండ్లలో వరదలకు పంట కొట్టుకుపోయి చెత్తాచెదారంతో నిండిన పొలం



కొట్టుకొచ్చిన నీటి ఇంజన్

పంట పొలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

చేబ్రోలు: ఇటీవల కురిసిన భారీవర్షాలకు రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల, సుద్దపల్లి గ్రామాల పరిధిలోని కాలువలకు గండ్లు పడి పొలాల్లోని పంట పూర్తిగా కొట్టుకుపోయింది. మెరక ప్రాంతాల్లోని కొన్ని పొలాలు రెండు రోజులుగా కొంత బయట పడుతున్నాయి. పొలాలు గుర్తు పట్టలేని విధంగా మారాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన చెత్తా చెదారం, మురుగు పొలాల్లో పేరుకుపోయింది. పొలాల్లోని గట్టుమీద ఉంచిన నీళ్ల ఇంజిన్లు కొట్టుకుపోయాయి. రైతులు పంట పొలాల్లో ఎరువు చల్లటం కోసం డీఏపీ, యూరియా కట్టలను దిబ్బల మీద నిల్వ చేశారు. భారీ వర్షాలకు ఎరువుల కట్టలు మాయమయ్యాయి. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుని న్యాయం చేయాలని రైతులు, కౌలు రైతులు కోరుతున్నారు.